**306 వ అధ్యాయం**

# ٣٠٦ - بَابُ تَحْرِيمِ اتِّخَاذِ الْكَلْبِ إلاّ لِصَيْدٍ أَوْ مَاشِيَةٍ أَوْ زَرْعٍ

# వేటకోసం, పశువుల, పొలాల రక్షణ కోసం తప్ప ఇతర పనులకోసం కుక్కల్ని పెంచటం నిషిద్ధం

١٦٩٠ - عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُمَا قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «مَنِ اقْتَنَى كَلْباً إلا كَلْبَ صَيْدٍ أَوْ مَاشِيَةٍ فَإِنَّهُ يَنْقُصُ مِنْ أَجْرِهِ كُلَّ يَوْمٍ قِيرَاطَانِ» متفقٌ عليه. وفي رِوَايَةٍ: «قِيرَاطٌ».

1690. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలియజేశారు: ఎవరయితే వేట లేక పశువుల రక్షణ కోసం తప్ప (ఇతర ఉద్దేశ్యంతో) కుక్కని పెంచుతారో వారి పుణ్యం ప్రతి రోజూ రెండు ఖీరాతులు తగ్గుతూ ఉంటుంది. *(బుఖారీ-ముస్లిం)*

వేరొక ఉల్లేఖనంలో 'ఒక ఖీరాతు తగ్గుతుంది' అని ఉంది.

*(సహీహ్ బుఖారీలోని జబాయెహ్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని బుయూ ప్రకరణం)*

١٦٩١ - وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ أَمْسَكَ كَلْباً، فَإِنَّهُ يَنْقُصُ كُلَّ يَوْمٍ مِنْ عَمَلِهِ قِيرَاطٌ إلَّا كَلْبَ حَرْثٍ أَوْ مَاشِيَةٍ» متفقٌ عليه. وفي رواية لمسلم: «مَنِ اقْتَنَى كَلْباً لَيْسَ بِكَلْبِ صَيْدٍ، وَلا مَاشِيَةٍ، وَلا أَرْضٍ، فَإِنَّهُ يَنْقُصُ مِنْ أَجْرِهِ قِيرَاطَانِ كُلَّ يَوْمٍ».

1691. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవరయితే కుక్కను (పెంచే ఉద్దేశ్యంతో) కట్టేశారో వారి ఆచరణ (పుణ్యం) ప్రతిరోజూ ఒక ఖీరాతు తగ్గుతూ ఉంటుంది. అయితే పొలాల, పశువుల రక్షణ కోసం కట్టేస్తే ఆ నష్టం ఉండదు. (బుఖారీ-ముస్లిం)

ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో "ఎవ రయినా వేట కోసం, పశువుల,

భూముల రక్షణ కోసం తప్ప (ఇతర ఉద్దేశ్యంతో) కుక్కను పెంచుతారో వారి పుణ్యం ప్రతిరోజూ రెండు ఖీరాతులు తగ్గుతూ ఉంటుంది" అని ఉంది.

*(సహీహ్ బుఖారీలోని ముజారఅ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని ముజారఅ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

వేటకోసం, పశువుల, పొలాల, భూముల, ఇండ్ల కాపలా కోసం కుక్కలను పెంచుకోవచ్చు. అంతకుమించి ఇతర ఉద్దేశ్యాలతో కుక్కలను పెంచుకోవటానికి అనుమతిలేదు. ఎవరైనా వేరితర ఉద్దేశంతో కుక్కలను పెంచినట్లయితే వారి పుణ్యంలో నుంచి ప్రతి రోజూ ఒకటి లేక రెండు ఖీరాతుల (యూనిట్ల) పుణ్యం తగ్గుతూ ఉంటుంది.

హదీసులో 'ఒకటి లేక రెండు' అన్న సందేహాస్పద పదం ఎందుకు ప్రయోగించబడింది? అనే ప్రశ్న ఈ సందర్భంగా జనించటం సహజమే. దీని గురించి పండితులు ఏమని వివరించారంటే దైవప్రవక్త (సఅసం) మొదటగా ఒక ఖీరాతు తగ్గుతుందని చెప్పారు. ఆ తర్వాత దాన్ని పెంచి రెండు ఖీరాతులు తగ్గుతుందని వివరించారు. ఈ హెచ్చుతగ్గులు గ్రామం, పట్టణాన్ని బట్టి వర్తిస్తాయని మరికొంతమంది పండితులు అన్నారు. పట్టణవాసుల పుణ్యం రెండు ఖీరాతులు తగ్గుతుందనీ, పల్లెవాసుల పుణ్యం ఒక ఖీరాతు మాత్రమే తగ్గుతుందని, పట్నవాసులకన్నా పల్లెవాసులకు కుక్కలను పెంచుకోవాల్సిన అవసరం ఎక్కువగా ఉండటమే ఈ హెచ్చుతగ్గులకు కారణమని చెప్పారు. అంటే ఎవరి ఇండ్లల్లోనయితే అటువంటి కుక్కల మూలంగా అపరిశుభ్రత ఎక్కువగా ఉంటుందో అటువంటి వారి పుణ్యం రెండు ఖీరాతులూనూ, అపరిశుభ్రత తక్కువగా ఉండేవారి పుణ్యం ఒక ఖీరాతునూ తగ్గుతూ ఉంటుందన్న మాట.

అసలు ఇంతకీ 'ఖీరాతు' అంటే ఎంత? దీని గురించి కూడా పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. హదీసుల్లో జనాజా నమాజు పుణ్యం గురించి చెప్పినప్పుడు కూడా ఈ పదం వాడబడింది. అక్కడ ఖీరాతు అంటే ఉహుద్ పర్వతమంత అని చెప్పబడింది. మరి ఈ ఖీరాతు పరిమాణం - పై హదీసులో పేర్కొనబడిన ఖీరాతు పరిమాణం రెండూ సమానమేనా? దీనికి కొంతమంది పండితులు 'అవును, ఆ రెండు పదాలూ ఒకే పరిమాణాన్ని సూచిస్తున్నాయి' అని సమాధానమిచ్చారు. కాగా మరి కొంతమంది పండితులు ఏమన్నారంటే - జనాజా నమాజు సందర్భంగా వచ్చిన ఖీరాతు ప్రస్తావన దైవానుగ్రహానికి సంబంధించినది. దానికి భిన్నంగా ఇక్కడ ఈ పదం శిక్షను, పర్యవసానాన్ని సూచించే సందర్భంలో ప్రయోగించబడింది. దైవానుగ్రహం ఇతర వస్తువులన్నింటి కంటే గొప్పది. కనుక రెండు చోట్లా ఒకే అర్థం తీసుకోవటం సమంజసం కాదు' అని చెప్పారు.